క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేటలో 4వ తేది శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైదేహి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి(బెంగళూరు) ఆస్పత్రి వైద్యులు లోకేష్ భరణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసీజీ, ఎకో, క్యాన్సర్ స్క్రీనింగ్, బీపీ, ఆర్‌బీఎస్ టెస్టు ఉచితంగా చేస్తామని, ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2.30 వరకూ గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ అరుణ అధ్వర్యంలో శిబిరం నిర్వహించనున్నట్టు తెలియజేశారు. అవసరమైన వారికి బెంగళూరులోని ఆస్పత్రిలో వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా శస్త్ర చికిత్స చేస్తామన్నారు.

చదువుల కోసం ఆర్థిక సాయం



సదుం: మండలంలోని జోగివారిపల్లె పంచాయతీ నాయిని వారిపల్లెకు చెందిన రాజేశ్వరి ఒంటరి మహిళ. ఆమె కుమార్తెలు హరిత(ఇంటర్ ద్వితీయ సంవత్సరం), హారిక(పదవ తరగతి) చదువుతున్నారు. వారి చదువుల కోసం మాతృసేవా చారిటబుల్ సొసైటీ అధ్యక్షుడు విశ్వనాథం గురువారం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

నియామకం



మణి

రామకుప్పం: చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ ఆదేశాలతో మండలంలోని 89 పెద్దూరు పంచాయతీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా మణిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి తెలిపారు. అలాగే, ఉపాధ్యక్షునిగా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా మురుగేష్, కోశాధికారిగా గజేంద్రను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మల్లిక, ఎంపీటీసీ సభ్యుడు వెంకటరమణ, గోవిందప్ప పాల్గొన్నారు.

ఘనంగా ఆడి 18 వేడుకలు



రామకుప్పం: మండలంలోని పాలరేవుగడ్డ బాలమురుగన్ ఆలయంలో గురువారం ఆడి 18 వేడుకలు ఘనంగా నిర్వహించారు. కర్ణాటక, ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రాల నుంచి భక్తులు ఆడి 18 పూజలకు విశేషంగా వచ్చారు. భక్తులు తమ వీపులకు కొక్కీలు తగిలించుకుని, వివిధ విన్యాసాలతో మొక్కులు చెల్లించారు. ఆలయ నిర్వాహకులు అన్నప్రసాదాల వితరణ చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నేడు పుంగనూరులో నిరసన

సదుం: పశ్చిమ ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ప్రాజెక్టులు నిర్మిస్తుంటే, మాజీ సీఎం చంద్రబాబు కుయుక్తులతో అడ్డుకోవడం శోచనీయమని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప విమర్శించారు. గురువారం వారు సదుంలో మాట్లాడారు. ప్రాజెక్టులు అడ్డుకుని, హంద్రీ–నీవా కాలువ పనులను పరిశీలించేందుకు ఆయన రావడం హాస్యాస్పదమన్నారు. ప్రాజెక్టులను అడ్డుకున్నందుకు రైతులతో కలిసి శుక్రవారం పుంగనూరులో నిరసన వ్యక్తం చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

సంఘాల ఆర్థిక నిర్వహణపై శిక్షణ

చౌడేపల్లె: స్వయం సహాయక సంఘాల ఆర్థిక నిర్వహణపై ప్రతి మహిళా భాగస్వామి కావాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం సర్వోత్తమ రెడ్డి అన్నారు. గురువారం ఆ శాఖ కార్యాలయంలో గ్రామ సమాఖ్య సభ్యులకు, సంఘాల మహిళలకు ఫైనాన్సియల్ పాలసీ విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. రుణ పరిపాలన, ఆర్థిక నిర్వహణ, అకౌంటింగ్ విధానాలు, అంతర్గత నియంత్రణ, ఆడిట్ నిర్వహణ విషయాలపై శిక్షణ ఇచ్చారు. తీసుకున్న రుణాలతో జీవనోపాధి పొంది ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. డీఎంజి లక్ష్మి, సీసీలు నూర్ మహమ్మద్, వెంకటపతి, మల్లీశ్వరి పాల్గొన్నారు.

చిత్రం చెప్పిన పేకాట కథ



ఇక్కడ చిత్రాన్ని చూస్తుంటే చెట్టు కింద కూర్చుని ఉన్నవారు ఏదో పోగొట్టుకున్నట్లు ఉన్నట్లు అనిపిస్తోంది కదూ! అక్షరాలా 22,330 రూపాయలు పోగొట్టుకున్నారు మరి. అంతేకాదు..నగదుతోపాటు 4 మోటార్ సైకిళ్లు, ఒక ఆటోను కూడా పోలీసులు పట్టుకుపోవడం బాధే కదా..! మేటరేమిటంటే.. చిన్న సోమల వద్ద పేకాట ఆడుతున్నట్లు గురువారం పోలీసులకు రహస్య సమాచారం అందింది. దీంతో ఎస్ఐ వెంకట నరసింహులు (చిత్రంలో ఎడమవైపు నిలబడి ఉన్న వ్యక్తి) సివిల్ డ్రెస్‌లో తన సిబ్బందితో కలిసి ఆ ప్రాంతానికి వెళ్లారు. చింతచెట్టు కింద తాపీగా పేకాట ఆడుతున్న వారిని గమనించి చుట్టుముట్టారు. అంతే వారి చేతుల్లోని పేకముక్కలు కిందపడ్డాయి. ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి నగదు, 4 బైక్స్, ఒక ఆటోను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. -సోమల

ప్రతి గడపలో సంతోషం



బుక్‌లెట్‌ను ఇస్తున్న ఎమ్మెల్సీ భరత్



పార్టీలో చేరిన టీడీపీ కార్యకర్తలతో ఎమ్మెల్సీ భరత్, నాయకులు

- ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని, జనమే ఆనందంగా తమ పర్యటనలో చెబుతున్నారని ఎమ్మెల్సీ భరత్ చెప్పారు. గురువారం ఆయన గుంజార్లపల్లె పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ఆయా కుటుంబాలు పొందిన పథకాల లబ్ధిని బుక్‌లెట్లతో తెలియజేశారు. సమస్యలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ, కులమతాలు, పార్టీలకు అతీతంగా అర్హులు అందరికీ సంక్షేమ పథకాలు అందడంతో ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు సంతృప్తితో ఉన్నారని చెప్పారు. దీనిని జీర్ణించుకోలేక చంద్రబాబు, పచ్చ మీడియా కల్పిత కథనాలతో ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని విమర్శించారు. బాబు హయాంలో ఎన్నికల వేళ కొన్ని కుటుంబాలకు రూ 5 వేల నుంచి రూ 10వేలు మాత్రమే ఇస్తే, వైఎస్సార్ సీపీ నాలుగేళ్ల పాలనలో ప్రతి కుటుంబానికీ లక్షల రూపాయల్లో లబ్ధి కలిగిందన్నారు. ప్రజలకు వాస్తవాలేమిటో తెలుసని, రాష్ట్రంలో ఎవరు రాజకీయ సర్వే చేసినా వైఎస్సార్ సీపీకి తిరుగులేని ఆధిక్యం తప్పదని చెబుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో కుప్పంలోనూ విజయ ఢంకా మోగిస్తామన్నారు. 2014 ఎన్నికల ముందు 600కు పైగా హామీలు ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి రాగానే హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. కానీ 2019 ఎన్నికల ముందు జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 98 శాతానికి మించి ఇప్పటికే నెరవేర్చినా టీడీపీ నాయకులు కువిమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.

వైఎస్సార్ సీపీలో టీడీపీ కార్యకర్తల చేరిక

టీడీపీ కార్యకర్తలు కె.మునెప్ప, డి.నాగరాజు, ఎస్.చౌడప్ప ఎమ్మెల్సీ సమక్షంలో వైఎస్ఆర్‌సీపీలో చేరారు. ఎమ్మెల్సీ భరత్ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, మండల పార్టీ కన్వీనర్ బుల్లెట్ దండపాణి, వైస్ ఎంపీపీ పట్టాభి, రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ చంగప్ప, నాయకులు చక్రపాణిరెడ్డి, మునిరత్నం గౌడు, ఏవీ జయరాం, రఘురామిరెడ్డి, సోమారెడ్డి, కోదండరెడ్డి, చలపతి, సుబ్బారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర సృష్టించిన 'జగనన్న సురక్ష'

- చిత్తూరు ఎమ్మెల్సీ భరత్



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహోన్నత లక్ష్యంతో ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం చరిత్ర సృష్టించిందని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ అన్నారు. గురువారం కుప్పంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇళ్ల వద్దకు వెళ్లి వారికి కావాల్సిన సర్టిఫికెట్లు నిర్ణీత సమయంలో ఇవ్వడం ఎక్కడా లేదన్నారు. కుప్పంలో నియోజకవర్గంలో 70 వేల కుటుంబాలు ఉన్నాయని, ఇందులో 59 వేల కుటుంబాల నుంచి ×జగనన్న సురక్ష÷కు దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో 54 వేలు ఇప్పటికే పరిష్కరించామని, కొన్ని రెవెన్యూ సంబంధిత సమస్యలు ఉన్నాయని, వాటిని త్వరలో పరిష్కరిస్తామన్నారు. మరో 15 రోజులు జగనన్న సురక్ష కొనసాగిస్తామని, జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏ ముఖం పెట్టుకుని జిల్లాకు వస్తున్నావు బాబూ?

చంద్రబాబు ఏముఖం పెట్టుకుని చిత్తూరు జిల్లాకు వస్తున్నారని చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ ప్రశ్నించారు. ఒక్క ప్రాజెక్టు గానీ, ఒక పథకం కానీ జిల్లాకు ఏనాడూ తేలేదని ఆరోపించారు. 14 ఏళ్లు సీఎంగా పనిచేసినా ఒక ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని, చివరకు సొంత నియోజక వర్గమైన కుప్పంకు తాగునీటిని ఇవ్వలేని బాబు, ప్రాజెక్టు సందర్శనలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 35 ఏళ్లుగా కుప్పంకు ఏమి చేయలేకపోగా, సిగ్గులేకుండా వర్షపు నీటిలో వరినాట్లు వేసి, టీడీపీ నాయకులు చిల్లర రాజకీయాలకు దిగుతున్నారని మండిపడ్డారు. ప్రైవేట్ మెడికల్, ఇంజినీరింగ్ కళాశాలలను తెచ్చి ప్రజలను దోచుకోవడం మినహా ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో రోజు రోజుకూ పెరుగుతున్న ఆదరణ చూసి చంద్రబాబు జనంలోకి వస్తున్నారని చెప్పారు. ఓటమి భయంతో మూడు నెలలకోసారి ఆయన కుప్పం బాట పడుతున్నారని వ్యంగ్యంగా అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ లబ్ధి

- మండలంలో 5,487 మందికి 'జగనన్న సురక్ష' ధ్రువపత్రాలు



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి

సోమల: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ గంగాధరం, జేసీఎస్ మండల కన్వీనర్ రాశెట్టి మధు అధ్యక్షతన 'జగనన్న సురక్ష' లబ్ధిపై సమీక్షించారు. పెద్దిరెడ్డి మాట్లాడుతూ...జగనన్న సురక్ష కార్యక్రమం కింద మండలంలో 5,487 మందికి వివిధ రకాలైన సర్టిఫికెట్లను ఉచితంగా ఇచ్చామని, దీనికి సర్వత్రా ప్రశంసలు అందుతున్నాయన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు పాలనలో ప్రతి ఆరు నెలలకో సంవత్సరానికో జన్మభూమి సభలు నిర్వహించి, అర్జీలు స్వీకరించి, మొక్కుబడిగా ఐదో, పదో పెన్షన్లో, రేషన్ కార్డులో మంజూరు చేసేవారని, అవి కూడా ఆ పార్టీ కార్యకర్తలకే అందేవని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక పార్టీలతో ప్రమేయం లేకుండా అర్హులందరికీ ఇళ్ల ముంగిటకే పథకాల ఫలాలు అందిస్తోందన్నారు. ఇదలా ఉంచితే, రాబోవు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత పటిష్టం చేయడానికి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు దృష్టి సారించాలన్నారు. అలాగే ప్రతి ఇంటికీ వెళ్లి ఓటర్లను కలవాలన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ డాక్టర్ వెంకటేశ్వరరావు, ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ ప్రభాకర, పార్టీ మండల మైనారిటీ అధ్యక్షుడు మస్తాన్‌వలీ, నేతలు పీఎల్ఆర్ రాజారెడ్డి, జిలానీ, మసూద్, రమణారెడ్డి, హరినాథ్, శివమూర్తి, రమణ తదితరులు పాల్గొన్నారు.

16 మంది క్షయ అనుమానితుల గుర్తింపు



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారులు

రొంపిచెర్ల: ఉచిత వైద్య శిబిరంలో 16 మంది క్షయ వ్యాధి అనుమానితులను గుర్తించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ రిజ్వాన్ తెలిపారు. గురువారం చిచ్చిలివారిపల్లెలో క్షయ వ్యాధిపై ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గళ్ల పరీక్షలు చేశారు. ఎనిమిది మందిని పీలేరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఎక్స్‌రే తీసుకుని రావాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయితే వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా చికిత్స చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీఎల్ఎస్ విజయకుమార్ యాదవ్, టీబీ సూపర్‌వైజర్ లక్ష్మీపతి, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ పంకజ, ఎంఎల్‌హెచ్‌పీ భారతి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.


వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ



పెద్దపంజాణి : పోషకాహార కిట్లు పంపిణీ చేస్తున్న జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి



రామకుప్పం: కిట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ



పలమనేరు: కిట్లను ఇస్తున్న కూర్మాయి ఎంపీటీసీ



సదుం: రెడ్డివారిపల్లెలో..

పెద్దపంజాణి: మండలంలోని రాజుపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం బాలింతలు, గర్భిణులకు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. వీటిని సద్వినియోగం చేసుకుని పోషకాహార లోపం, రక్తహీనత సమస్యలను అధిగమించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పలమనేరు: మండలంలోని టి.వడ్డూరు, కూర్మాయి పంచాయతీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సర్పంచ్ మునస్వామి, ఎంపీటీసీ సభ్యురాలు నాగరత్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను, టేక్‌హోమ్ రేషన్ పంపిణీ చేశారు. కొలమాసనపల్లె పంచాయతీ దిగువ మారుమూరులో ఉప సర్పంచ్ నరసింహారెడ్డి పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ, ఇకపై గర్భవతులు, బాలింతల సౌకర్యార్థం ఇళ్ల వద్దకే కిట్లను పంపిణీ చేస్తామన్నారు. ఆరోగ్యకర సమాజం కోసం వీటిని ప్రభుత్వం ఇస్తోందన్నారు.

సదుం: మండలంలోని తిమ్మానాయనపల్లె, బూరగమంద, జోగివారిపల్లె పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవాలని, కిట్లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచులు మురళీరెడ్డి, హనుమంతరెడ్డి, జగన్నాథం, ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

రామకుప్పం మండలంలో..

రామకుప్పం: మండలంలోని మిట్టపల్లెలో జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, అయ్యప్పగానిపల్లెలో ఎంపీపీ సుబ్రమణ్యం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భవతులు, బాలింతలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నేతలు వంశీరెడ్డి, రామిరెడ్డి, మోహన్ రెడ్డి, నారాయణస్వామి, రవి పాల్గొన్నారు.

గడ్డి కత్తిరింపు యంత్రాల పంపిణీ



గడ్డి కత్తిరింపు యంత్రాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

పుంగనూరు: మండలంలో 75 మంది పాడి రైతులకు పశుగ్రాస కట్టర్లను పంపిణీ చేశారు. గురువారం వెటర్నరీ ఏడీ డాక్టర్ మనోహర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి రైతులకు గడ్డి కత్తిరింపు యంత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు 75 మంది పాడి రైతులకు రూ.25.48 లక్షల విలువ చేసే 75 కట్టర్లకు రూ.10.20 లక్షల సబ్సిడీతో ఇచ్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రారెడ్డి యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, శంకరప్ప, రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పద్యాల పోటీలు

పలమనేరు: రానున్న తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాల స్థాయి విద్యార్థులకు నీతి పద్యాల పోటీలను నిర్వహిస్తున్నట్టు స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి నిర్వాహకులు తులసీనాథం నాయుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వందకు పైగా పద్యాలను చెప్పగలిగే పిల్లలు ఈనెల 15లోపు 9346249011 సెల్ నంబరుకు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ప్రతిభ చాటిన ఐదుగురికి నగదు బహుమతులు ఇస్తామన్నారు.

అమ్మవారి సేవలో జాయింట్ కలెక్టర్

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ బోయకొండ గంగమ్మను చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రమౌళి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం అర్చకులు అమ్మవారి చరిత్ర, విశిష్టతను జేసీకి తెలియజేశారు. అమ్మవారి శేష వస్త్రం కప్పి, తీర్థప్రసాదాలను అందజేశారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

రామకుప్పం: 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి 10వ తరగతి, ఇంటర్మీడియెట్ ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభమైనట్లు అక్రిడియేటెడ్ ఇన్‌స్టిట్యూషన్ కో–ఆర్డినేటర్ విజయ్ కుమార్ తెలిపారు. 15 ఏళ్లు పైబడిన వారు ఈ నెలాఖరులోపు ప్రవేశాలు పొందవచ్చన్నారు. బడి మానేసిన వారు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు రామకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాల ఏఐ 9494192200 సెల్ నంబరును సంప్రదించాలన్నారు.

కుయ్యవంక అటవీ భూములపై కలెక్టర్‌కు నివేదిక

పలమనేరు: పలమనేరు ఫారెస్ట్ రేంజి గంగవరం మండలం కుయ్యవంక ఫారెస్ట్‌లో ఇంటి పట్టాల విషయంగా స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ, ఫారెస్టుశాఖ అధికారులు గురువారం సమావేశం నిర్వహించారు. ఈ భూములు ఫారెస్ట్ ఆధీనంలో ఉన్నాయని తేల్చారు. దీనిపై జిల్లా కలెక్టర్ ఆదేశాలిస్తే తాము తగు చర్యలు తీసుకుంటామని స్థానిక ఎఫ్ఆర్వో శివన్న, గంగవరం రెవెన్యూ అధికారులు తెలిపారు.

దమ్ముంటే ఎమ్మెల్యే సవాల్‌ను స్వీకరించండి

- నాడు అమరనాథరెడ్డికి ఓట్లేయని మీరేంటి మాట్లాడేది?
- టీడీపీ నాయకులపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఫైర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పలమనేరు: 2014 ఎన్నికల్లో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి వచ్చిన అమరనాథ రెడ్డిని వ్యతిరేకించి, మొన్నటి ఎన్నికల్లో ఆయన టీడీపీ నుంచి పోటీ చేస్తే ఆయనకు ఓటు కూడా వేయకుండా ఫ్యాన్‌కి ఓటేసి, ఇప్పుడు టీడీపీలో ఉంటున్న నాయకులు అమరనాథరెడ్డి తరఫున వకల్తా పుచ్చుకుంటుంటే జనం నమ్ముతారా? అని పలమనేరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేతలు మండిపడ్డారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, ఆస్పత్రి కమిటీ చైర్మన్ చెంగారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద మాట్లాడారు. మాజీ మంత్రి హయాంలో ఇక్కడ జరిగిన అభివృద్ధి, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని ఎమ్మెల్యే వెంకటేగౌడ సవాల్ విసిరితే..దానిని వదిలేసి టీడీపీ నాయకులు ఇతరత్రా విషయాలను మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే విసిరిన సవాల్‌ను మాజీ మంత్రి స్వీకరించకుండా వారి అనుచరులతో ప్రెస్‌మీట్లు పెట్టించడం ఆయనకే చెల్లిందని అపహాస్యం చేశారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా వెంకటేగౌడ మరోసారి 40 వేల మెజారిటీతో గెలవడం ఖాయమన్నారు. తాము నాలుగేళ్లుగా ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను పరిష్కరిస్తుంటే వీరికేం పనిలేదని టీడీపీ నాయకులు విమర్శించారన్నారు. అయితే ఇదే కార్యక్రమాన్ని ఇంటింటికీ తెలుగుదేశం పేరిట రాష్ట్రంలో ఎక్కడా లేకున్నా పలమనేరులో మాత్రం మాజీమంత్రి ఎలా చేస్తున్నారని ప్రశ్నించారు. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టడం, రెచ్చగొట్టడం చేసినంత మాత్రాన ఓట్లు పడవనే విషయం గత ఎన్నికల్లో తెలిసినా మళ్లీ టీడీపీ అదే పంథా కొనసాగిస్తోందని దుయ్యబట్టారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, కౌన్సిలర్లు కమాల్, కోదండరామయ్య, రహీంఖాన్, శ్యామ్ హైదర్, రాజేష్, ఫయాజ్, మున్న, ముజ్జు, నరేష్, ప్రసాద్ రెడ్డి, గిరిరాజరెడ్డి, వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?

- టీడీపీ నాయకులకు ఎంపీపీ సవాల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యువరాజు

వి.కోట: మండల టీడీపీ నాయకులు స్థాయిని మరచి మాట్లాడడమేకాకుండా జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తే సహించేది లేదని ఎంపీపీ యువరాజు మండిపడ్డారు. గురువారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఆయన మండల నాయకులు, ప్రతినిధులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మండలంలో అభివృద్ధి ఏ స్థాయి చేశామో చూపించడానికి తాము సిద్ధమని, మీరు ఐదేళ్ల పాలనలో ఏమేరకు చేశారో చూపడానికి బహిరంగ చర్చకు సిద్ధమా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో మండలంలో రూ.60 కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్లు వేశారని, రూ.27 కోట్లతో పంచాయతీ రాజ్ అభివృద్ధి పనులు, ఆర్‌డబ్ల్యుఎస్ ద్వారా రూ 3.70కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేశామని, అలాగే మండలంలో 27 జగనన్న లేఔట్లు మంజూరు చేశామన్నారు. ఇతర పథకాలతో ప్రజలు పొందిన లబ్ధి గురించి వివరించారు. కేవలం వి.కోట పంచాయతీలో సర్పంచ్ పీఎన్.లక్ష్మి ఈ మూడేళ్లలో రూ.4కోట్లతో చేసిన అభివృద్ధి మీకు కనపడలేదా? అని ప్రశ్నించారు. జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఇప్పటివరకు మండలానికి రూ 10.70 కోట్లతో అభివృద్ధి చేశారన్నారు.వచ్చే ఎన్నికల్లో కనీసం మీ పంచాయతీలోనైనా కనీసం ఒక్క ఓటు మెజారిటీతోనైనా మీ అభ్యర్థిని గెలిపిస్తే తాను ఎంపీపీ పదవికే రాజీనామా చేస్తానని, మీరు ఓడిపోతే మీరు శాశ్వతంగా రాజకీయాలకు దూరంగా ఉంటారా? అని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్‌పై నిందారోపణలు చేస్తే ఉపేక్షించమని జెడ్పీ చైర్మన్ ప్రత్యేక సలహాదారుడు ఎస్ఏగౌస్ హెచ్చరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ లక్ష్మణ్, నాయకులు భూపతి, కిషోర్, శుభాష్, ఇంద్రేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు



కొండామర్రి వద్ద వైఎస్సార్ పొలంబడి నిర్వహిస్తున్న ఏడీఏ శివకుమార్

చౌడేపల్లె: వ్యవసాయంలో రైతులు ఆధునిక పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ సహాయపథక సంచాలకులు శివకుమార్ అన్నారు. గురువారం కొండామర్రిలో వైఎస్సార్ పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. రైతులు సాగుచేసిన వేరుశనగ పంటలను పరిశీలించి అక్కడే రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ, సాగుకు ముందు వేరుశనగ విత్తనాలను విత్తన శుద్ధి చేస్తే పంటను 40 రోజుల వరకు చీడపీడల నుంచి రక్షించుకోవడం సాధ్యమన్నారు. పొలం చుట్టూ నాలుగు వరుసల్లో జొన్న లేదా సజ్జ వంటి ఎత్తుగా పెరిగే పంటలను కంచెలా వేసుకోవాలన్నారు. తద్వారా రసంపీల్చే పురుగులు, తెగుళ్ల బారి నుంచి ప్రధాన పంటలను కాపాడుకోవచ్చన్నారు. పూత దశలో ఎకరాకు 200 కేజీల జిప్సం వాడితే పంట అధిక శాతం దిగుబడి పొందవచ్చన్నారు. ఏఓ జ్యోతమ్మ, వీఏఏ నవీన్, అర్షద్, వీహెచ్ఏ గణేష్, రైతులు నాగభూషణరెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

రాగి పంట సాగుపై శిక్షణ



రామకుప్పం: మండలంలోని గొరివిమాకులపల్లెలో గురువారం డీఆర్‌సీ, ఆత్మ సౌజన్యంతో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు నాగపద్మిని మాట్లాడుతూ, రైతుభరోసా కేంద్రం పరిధిలోని రైతులతో రాగి పంట సాగు విస్తీర్ణం పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేయడమేగాక సాగుపై శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. తక్కువ పెట్టుబడి, తక్కువ మందులు, ఎరువులు, నీటితో పంటను సాగు చేసి అధిక ఆదాయం పొందవచ్చని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో రాగి పంటకు కనీస మద్దతు ధర రూ.3846 ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా డీఆర్‌సీ వ్యవసాయ అధికారులు లక్ష్మీప్రసన్న, పద్మజ, మండల వ్యవసాయాధికారి అమృత, గ్రామ వ్యవసాయ సహాయకులు ఆనంద్, అమరేష్, మధురవాణి, రైతులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి : నిందితుడి అరెస్ట్

గంగవరం: మండలంలోని కీలపల్లెకు చెందిన సుబ్రమణ్యంపై గ్రామస్తుడు సురేంద్రరెడ్డి రాళ్లతో దాడి చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి కథనం..గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆనందస్వామిపై గతంలో జరిగిన హత్యాయత్నం కేసులో సురేంద్రరెడ్డి ఏ–1 ముద్దాయిగా ఉన్నాడు. అప్పటి నుంచి పరారీలో ఉన్న అతడు యాంటిసిపేటరీ బెయిల్‌పై తరువాత గ్రామానికి వచ్చాడు. అయితే ఈ కేసులో బాధితుడు ఆనందస్వామికి అనుకూలంగా గ్రామంలోని సుబ్రమణ్యంగా సాక్షిగా ఉండడంతో అతనిపై కక్ష పెంచుకున్నాడు. తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెబుతావా? అంటూ గత మంగళవారం అతడిపై రాళ్లతో దాడి చేశాడు. ఈ నేపథ్యంలో సురేంద్రరెడ్డి నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

డ్రైవర్‌పై దాడి

పుంగనూరు: డ్రైవర్‌పై దాడిపై దాడి చేసి డబ్బులు కాజేసిన ఘటన గురువారం చోటుచేసుకుంది. బాధితుడి ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ మోహన్‌కుమార్ కేసు నమోదు చేశారు. వివరాలు.. మండలంలోని కుమ్మరనత్తంకు చెందిన లోకరాజు ఒక వాహనంలో టమాటాల లోడుతో పుంగనూరుకు వచ్చి, క్రేట్లు దించి, వెళ్తుండగా మార్గమధ్యంలో నక్కబండకు వెళ్లే దారిలో కొంత మంది యువకులు అడ్డుకున్నారు. బాటిళ్లు, రాళ్లతో దాడి చేసి అతడిని గాయపరచి డబ్బులు లాక్కున్నారు. లోకరాజు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

కీలపట్ల దళితవాడ గొంతు తడిసింది

- తీరిన తాగునీటి సమస్య
- ఎమ్మెల్యే చొరవతో నూతన తాగునీటి బోరు



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

గంగవరం: మండలంలోని కీలపట్ల దళితవాడలో రెండు నెలలుగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేది. ఉన్న బోరు మట్టితో పూడిపోవడంతో నీటి కోసం ఇబ్బందులు పడ్డారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ దృష్టికి సమస్య రావడంతో ఆయన స్పందించారు. ఆయన ఆదేశాలతో పంచాయతీ అధికారులు వారం క్రితం కాలనీలో రూ. 1.5 లక్షలతో కొత్త బోరు వేశారు. గురువారం బోరుకు మోటారు, పైపులు అమర్చారు. నూతన బోరును ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నాయకులు చంద్రప్ప, గిరిరాజారెడ్డి, ఎంపీటీసీ గంగులమ్మ, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ తదితరులు కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యేకు, నాయకులకు దళితవాడ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్తుత్తి పోస్టులు మానుకో టీడీపీ సర్పంచూ!

తాగునీటి సమస్యను టీడీపీ సర్పంచ్ చంద్రశేఖర్ పరిష్కరించినట్టుగా బోరు వద్ద ఫొటోలు తీసుకుని సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం హాస్యాస్పదంగా ఉందని కాలనీ ప్రజలు మండిపడ్డారు. ఎమ్మెల్యే చొరవతో తాగునీటి సమస్య పరిష్కారమైతే, బోరుకు పైపులు, మోటార్ అమర్చే సమయంలో అక్కడికి వెళ్లిన సర్పంచ్ ఫొటోలు తీసుకుని, తాను పరిష్కరించినట్లు సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో స్థానిక కాలనీ ప్రజలు, మరి కొందరు యువకులు 'ఉత్తుత్తి పోస్టులు మానుకో సర్పంచూ' అంటూ అదే సోషల్ మీడియాలో కౌంటర్లు ఇచ్చారు.